విశ్వ'కథ'ంబమ్




# హాస్యరచయిత అనుభవాలు

ఇంగ్లీషు మూలం
ఓ హెన్రీ

పాతికేళ్లపాటు నన్ను ఇబ్బంది పెట్టకుండా నా శరీరంలో అణిగిమణిగి ఉండి ఒక్క పెట్టున బయటకు పొక్కింది. అయితే నా చుట్టూ ఉన్నవాళ్లు ఆ-రోగాన్ని పొంగూ, తట్టూ అనకుండా హాస్యం అని పేరు పెట్టారు. మా స్టోరులో పనిచేస్తున్నవాళ్లంతా కలిసి మా పెద్ద భాగస్వామికి తన స్వర్ణోత్సవ సందర్భంగా ఒక వెండి ఇంక్ స్టాండ్‌ని కొనిపెట్టారు. దాన్ని అందివ్వాలని మేమంతా అతని గదిలో గుమ్మిగూడాము. బహూకరించే బాధ్యత నామీదకు నెట్టేశారు. ఒక వారం రోజులుగా కుస్తీ పట్టి చిన్న ఉపన్యాసం తయారుచేశాను. దాన్ని అక్కడ విడిచిపెట్టాను. అదిగో, ఇక దాంతో వచ్చిపడింది. దానిలో చమక్కులు, ద్వంద్వర్థాలు, శ్లేషలు, తమాషాలు విని అంతా పడిపడి నవ్వారు. ఇనుపసామాన్ల బజారులో పేరున్న మా సంస్థ అంతా నవ్వుల్తో హోరెత్తిపోయింది. ఆ ముసలి మార్లోగాడు కాసింత చిరునవ్వు నవ్వాడో, లేదో ఇక మిగతా ఉద్యోగులంతా గొల్లుమన్నారు. ఆ ఉదయం తొమ్మిదిన్నర నుంచే విదూషకుడుగా నామీద ఒక ప్రతిష్ఠాత్మక ముద్ర పడిపోయింది.

నే నలా సంపాదించుకున్న ఆత్మవిశ్వాసాన్ని నాతోటి గుమాస్తాలు ఉప్పున ఊది ఎగదోశారు. ఒకరి తర్వాత ఒకరు నా ప్రసంగంలో ఎంత గడుసుతనం ఉందో, ఎంత మజా ఉందో వివరించారు. ఇక అలా నా మాటకారితనాన్నీ, దాని ప్రమాణాన్నీ కాపాడుకోవాలని ఆశించారు. ప్రతిరోజూ వ్యవహార ప్రసంగాల్లో మిగతావాళ్లంతా ఎలా మాట్లాడినా - నేను మాత్రం కాస్త హాస్యస్ఫోరకంగా మాట్లాడవలసి వచ్చేది. అతి సాధారణమైన వ్యవహారంలో కూడా నేనేదో హాస్యాన్ని సృష్టించాలని అంతా ఎదురు చూసేవారు. నేను అకౌంట్స్ రాసిపెట్టే వాళ్లల్లో రెండోవాణ్ణి. నే వేసిన బాలన్స్ షీట్‌లో కానీ, అమ్మకాల పట్టీలో గానీ కాసింత నవ్వు తెప్పించే విషయమంటూ లేకపోతే నా తోటి ఉద్యోగులు ఎంతో నిరుత్సాహ పడిపోయేవారు. అంచెలంచెలుగా నా ప్రతిభ విస్తరించి స్థానికంగా నా కొక అస్తిత్వం, గుర్తింపూ వచ్చేసింది. మా ఊరు చిన్నదే. ఈ ప్రచారం ఏమంత అసాధ్యం కాదు మరి. మా ఊరు దినపత్రిక ఒకటి నా భాష్యానికి కాస్త ప్రచారం ఇచ్చేది. మా సమాజంలో నలుగురు పోగయ్యే ప్రతి అవకాశంలోనూ నేను ప్రత్యక్షం కాక తప్పలేదు.

ఛలోక్తులు విసరడంలోనూ, మీదపడ్డ వాటిని సునాయాసంగా తిప్పికొట్టడంలోనూ కాసింత నేర్పుందన్న నమ్మకం నాకు లేకపోలేదు. ఆ నేర్పుని కాస్త సాధకంతో పెంచి పోషించాను. నా హాస్యం తేలికపాటిదే కానీ, ఎవర్నీ బాధించే వ్యంగ్య ధోరణి లేదు. నేను కంటపడగానే అంతా చిరునవ్వులు కురిపించేవారు. నేనూ వాళ్లని కలుస్తూనే ఏదో తాజా చమక్కుతో ఆ చిరునవ్వుల్ని అట్టహాసంగా మార్చి పారేసేవాణ్ణి.

నా పెళ్లి చిన్న వయసులోనే జరిగింది. మా కో మూడేళ్ల ముచ్చటైన చంటివాడు, అయిదేళ్ల పాప ఉన్నారు. పొదరింటి లాంటి మా చిన్న గూటిలో మేం హాయిగానే ఉండేవాళ్లం. ఇనుప సామాన్ల కొట్లో నేను బొటాబొటీగా తెచ్చిన సంపాదన నన్ను సిరిగలవాళ్లకు చుట్టుకునే దురలవాట్లకు దూరంగానే ఉంచింది.

చాలా అపురూపమైనవని నేను భావించే చతురోక్తులూ, సంఘటనలూ అప్పుడప్పుడు రాసి, అలాంటివి అచ్చువేసుకునే పత్రికలకు పంపేవాణ్ణి. వాటిని అ

పత్రికలు వెంటనే స్వీకరించడమే కాదు; ఇంకా అలాంటివి పంపమని పాత్రికేయులు అడుగుతూ ఉండేవారు.

ఒక ప్రముఖ వారపత్రికా సంపాదకుడు ఉత్తరం రాశాడు. ఒక కాలమ్‌లో వేసుకుందుకు హాస్యరచన ఒకటి పంపమన్నాడు. సంతృప్తికరంగా ఉంటే వారం వారం వేసుకునే అవకాశం ఉందని కూడా ధ్వనించేలా ఉత్తరం రాశాడు. నేను సరే అని పంపాను. రెండు వారాల తర్వాత ఆ సంపాదకుడు నాతో ఒక ఏడాదికి కాంట్రాక్ట్ కాగితాలు పంపాడు. ఆ ఒప్పందంలో సూచించిన డబ్బు నాకు ఇనుపసామాన్ల కొట్టు వాడిచ్చే మొత్తంకన్నా చాలా ఎక్కువగానే ఉంది.

ఇక నేను పొంగిపోయాను. నా భార్య అయితే సరేసరి. ఆమె ఊహాలోకంలో నా శిరస్సుమీద ఎన్నడూ వాడని పూల కిరీటాన్ని ఉంచి విజయోత్సాహాన్ని ప్రకటించింది. ఆ రాత్రి నాకు బ్రహ్మాండమైన విందు చేసింది. ఇక వెట్టీ చాకిరి నుంచి బయటపడే అవకాశం ఇదే. నా భార్యతో దీర్ఘంగా ఆలోచించాను. స్టోర్స్‌లో నేను చేస్తున్న పని విడిచిపెట్టి హాస్యరచనకే అంకితం అయిపోవడమే మంచిదని ఇద్దరం నిశ్చయించాము. అన్నంత పనీ చేశాను. నాతోటి గుమాస్తాలు నాకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అక్కడ నేనిచ్చిన ఉపన్యాసం అపురూపమైనదే. తు.చా. తప్పకుండా అది స్థానిక గజెట్‌లో అచ్చయింది.

మర్నాడు ఉదయమే లేచి గడియారం చూసుకున్నాను. అయ్యబాబోయ్! ఆలస్యమైపోయింది అని హడావిడి చేసి అరిచాను. నా బట్టలు వెతుక్కుంటున్నాను. నేను ఒక హాస్యరచయితననీ, ఇనుపసామాన్ల స్టోరులో బానిసని కాననీ నా భార్య జ్ఞాపకం చేసింది. కాఫీ, టిఫెన్ అందించింది. నన్ను సగౌరవంగా వంట గదికి దూరంగా ఉన్న చిన్నగదిలోకి తీసుకుపోయి చూపించింది. ఓహ్! అక్కడ నాకు కుర్చీ, టేబుల్, రాసుకుందుకు పెద్ద అట్ట, సిరాబుడ్డి, యాష్‌ట్రే అమరి ఉన్నాయి. అంతేకాదు; రచయిత క్కావలసిన హంగులు ఇంకెన్నో అమర్చింది. అప్పుడే పూసిన గులాబీలు, గోడకి కాలండరు, చేతికందేలా ఒక నిఘంటువు, ఊహాకీ ఊహాకీ మధ్య విరామంలో కాస్త నోట్లో వేసుకోడానికి సంచిలో కొన్ని చాక్లెట్లు చూశాను. నేను స్థిరంగా కూర్చున్నాను. గోడకి తగిలించిన అలంకరణల వైపు దృష్టి సారించాను. అందంగా గీసిన నగిషీలు, ఏవేవో చిత్రమైన రూపాలు, చిత్రమైన చతుర్భుజాలు చూస్తూ ఊహల్లో హాస్యాన్ని శోధిస్తున్నాను.

ఇంతలో ఒక గొంతు మేల్కొలిపింది. అది నాభార్యదే. "మీరు మరీ అంత సీరియస్‌గా రాసుకోకుండా ఉంటే భోజనానికి లేవండి" అంది. వాచీ చూసుకున్నాను. అయిదు గంటల కాలం ఇట్టే గడిచిపోయింది. భోజనానికి లేచాను.

"మీరు మొదట్నుంచీ మరీ ఎక్కువ శ్రమపడిపోకూడదు సుమండీ! అదెవరో నాకు సరిగా గుర్తుకు రావడంలేదు. నెపోలియనా లేక గెథే ఏమో! మెదడుతో చేసే పని రోజుకు అయిదు గంటలే చాలు అన్నాడట. నన్నూ, పిల్లల్నీ అలా పార్కుకు తీసుకెళ్లరూ?" అంది గోముగా.

కాస్త నేనూ అలసిపోయినట్టు ఒప్పుకుని అలా అందరితో కలిసి బయలుదేరాను.

నేను మెల్లగా గాడిలో పడ్డాను. ఒక నెల తిరక్కుండానే గతంలో ఇనుప సామాన్లను ఓడ ఎక్కించినంత సాఫీగా నా పని చకచక నడిపించాను. విజయవంతంగానే సాగింది.

నేను రాస్తున్న కాలమ్ వారపత్రికలో కాసింత సంచలనం కలిగించింది.

**అనువాదం: గిడుగు రాజేశ్వరరావు**

హాస్య సృష్టికర్తల జాబితాలో తాజాగా విరిసిన పువ్వు అని విమర్శకులు నన్ను ఎత్తేశారు. ఇతర పత్రికలకు కూడ కొన్ని రచనలు పంపి, నా ఆదాయాన్ని పెంచుకోగలిగాను. ఈ రకం రచనా వ్యాసంగంలో ఉండదగ్గ వ్యాపార రహస్యాల్ని పుక్కిట పట్టేశాను. ఒక తమాషా అయిన ఆలోచన రాగానే రెండు పంక్తుల హాస్యోక్తిగా మలిచేసి ఒక డాలరు సంపాదించేవాణ్ణి. మసిపూసి మారేడుకాయ చేసి నాలుగు పంక్తులు మినీ కవితగా నిలబెట్టేవాణ్ణి.

డబ్బుని పొదుపు చెయ్యడం కూడా నేర్చుకున్నాను. కొత్త తివాచీ కొన్నాను. గదిలో ఒక ఆర్గాన్(వాద్యం) తెచ్చి పెట్టాను. ఇనుప సామాన్ల కొట్లో ఒక కుర్రకుంకగా కాకుండా పట్నంలో ఒక ప్రముఖుడిగా సమాజం నన్ను గుర్తించింది.

అయిదారు మాసాల తర్వాత నే నందిస్తున్న హాస్యంలో సహజ సారస్యం ఇగిరిపోయినట్లయింది. సునాయసంగా నా నోటినుండి చమక్కులూ, ఛలోక్తులూ రాలిపడడం మానేశాయి. సరుకు దొరక్క వెదుక్కోవలసి వచ్చింది. మంచి ఆలోచనలు దొరికితే చాలని స్నేహితుల సంభాషణలు శ్రద్ధగా వినడం మొదలుపెట్టాను. అప్పుడప్పుడు నా పెన్సిల్ కొసను నమిలివేయడం, గోడవైపు అదేపనిగా గంటలకొద్దీ చూడ్డం...ఒక తాజా ఛలోక్తి దొరక్క గిజగిజలాడ్డం జరిగేది. అలా నేను పరిచితుల దృష్టిలో ఒక పక్కవాద్యగాడిలా, ఒక సుత్తిగాడిలా, ఒక అలసిపోయిన ఆశపోతుగా, ఆఖరికి వాళ్ల సంతోషాన్ని హరించే దొంగగా మిగిలిపోయాను. ఒక ఛలోక్తి గానీ, ఉపమానంగానీ కొత్త పదప్రయోగం కానీ వాళ్ల పెదవి దాటితే చాలు ఇంక వేటకుక్క ఎముకమీద పడ్డట్టు ఆత్రంగా దాని మీదకు ఉరికేవాణ్ణి. నా ధారణ మీద నమ్మకం చాలక ఏదో మిష పెట్టుకుని, చాటుకి పోయి నా జేబులోని నోట్‌బుక్కులోనో, చొక్కా చేతి అంచుమీదనో రాసేసుకునేవాణ్ణి. దాన్ని ఎక్కడో ఉపయోగించేయాలన్న యావ. విస్మయంగానో, విచారంగానో నాలోని ఈ మార్పును నా మిత్రులు గమనించేవారు. నేను ఒకనాటి మనిషిని కాను. బాగా మారిపోయాను. అప్పట్లో నేను వాళ్లకి వినోదం ప్రమోదం పంచేవాణ్ణి. ఇప్పుడు నేను వాళ్ల మీద పడి తిని బతుకుతున్నాను. ఎందుకంటే నా జోకులు వాళ్లని నవ్వించడానికి సులభంగా, విరివిగా రాలవు. అవే నాకు జీవనాధారం. నేను ఆకలిగొట్టుగా నా స్నేహితుల్ని పొగిడి వాళ్లను కుదిపి, పిండి ఏదన్నా జోకు రాలిపడితే ఏరుకుపోయే నక్కలా మారిపోయాను.

సుమారుగా అంతా నన్ను తప్పించుకు తిరుగుతున్నారు. నేను నవ్వడమే మరచిపోయాను. దక్కించుకున్న చతురోక్తికి నవ్వుతూ ప్రతిస్పందించడం అసలే మానుకున్నాను. నా హాస్యరచనకు కావలసిన ముడి సరుకు దాచుకోవడంలో సమయం, సందర్భం లేదు సరికదా నీ నా తన భేదంకూడా లేదు. చర్చిలో ప్రార్థించే సమయంలో కూడా ఏదైనా హాస్యసృష్టికి సరుకు దొరుకుతుందేమో అన్న తపనలోకి దిగజారిపోయాను. మతబోధకుడు చేసిన ఉపన్యాసం కూడా మనసులో వడబోసి ఏదైనా పనికొచ్చే హాస్యపు సరుకు కోసం చూసేవాణ్ణి. మాటల్లో దొరికే శ్లేషలు, ద్వంద్వార్థాల కోసం ఆలోచిస్తూంటే చర్చిలోని గంభీరమైన బ్యాండు వాద్యం నా ఆలోచనలకి తాళం వేస్తున్నట్లు అనిపించేది. ఇక నా ఇంటి సంగతి చెప్పాలా? నా వేటకి అదొక అడవైపోయింది. నా భార్య ఒక్కతే నా బాధనీ ఆరాటాన్నీ సహృదయంతో పంచుకునేది. ఒకప్పుడు ఆమెతో మాట్లాడుతూ ఉంటే నాకెంతో ఉల్లాసంగా ఉండేది. ఆమె ఆలోచనల్తో నాకు అంతులేని వినోదం పంచిపెట్టేది. ఇప్పుడో? ఆమెని నా స్వప్రయోజనానికి ఉపయోగించుకుంటున్నాను. స్త్రీలకు మాత్రమే ప్రత్యేక మనిపించే భోళా

ప్రసంగాల్ని ఏరుకుంటూ, ఆమె దగ్గర దోచుకుంటున్న ఆణిముత్యాల్లాంటి సత్తెకాలపు మాటల్ని బజారుపాలు చేస్తూ ఆమె నొక బంగారుగనిలా చూస్తున్నాను. ఒక టక్కరి దయ్యంలాగ నే నామెను మాటల్లోకి దింపి అమాయకంగా తన ఇంటి నాలుగుగోడల మధ్యకే పరిమిత మనుకునే నమ్మకంతో నోరు విప్పగానే ఆ మాటల్ని అక్షరరూపంలో అంగడికి తరలిస్తూ వచ్చాను. ఒక జూడాస్‌లా దిగజారిపోయాను. ప్రేమ నటిస్తూ నమ్మకద్రోహం చేస్తున్నాను. నమ్మి నా ముందు వొలికిస్తున్న తియ్యని అనుభవాల్ని, పడకటింటి ముచ్చటల్ని కాసులకు లోనై కాస్త గుడ్డలు తొడిగి బజారుపాలు చేసేస్తున్నాను. రాత్రిపూట అమాయకపు మేకపిల్ల మీదకు దూకే క్రూరమైన తోడేల్లాగా ఆమె పక్కన చేరి నిద్రలో జారవిడిచే పలవరింతనైనా మరుచటి రోజు అమ్ముకోదగ్గ సరుకుగా పనికివస్తుందేమో అని నిరీక్షించేవాడిని. ఇక ఆ దేవుడే నన్ను రక్షించాలి. అక్కడితో ఆగలేదు. నా విషపుకోరలు నా పసిపిల్లల పలుకుల్ని కూడా నమిలి మింగేవి.

నా ఇద్దరు పిల్లలు(గయ్, వయోలా) అవిశ్రాంతంగా తుళ్లింతలాడే మాటల ఊటలు. ఆ మాటల్ని కూడా బజారులో వేసేసేవాణ్ణి. ఒక పత్రికలో 'చిన్నతనపు చిలిపి ఊహలు' అన్న శీర్షికలో వాటిని వాడుకున్నాను. గంభీరంగా మాటువేసి పొంచిపొంచి వేటాడుతున్నంత హంగామా చేసి పసివాళ్ల మాటలు సేకరించేవాడిని. తలుపు చాటున, సోఫా వెనక నక్కి మోకాళ్ల మీద పాకి వాళ్ల మాటలు, పాటలు దొంగతనంగా వినేవాణ్ణి. సిగ్గూ ఎగ్గూ పోయి వాళ్లని ఒక పక్కవాద్యగాడిలా అనుసరిస్తూ పోయాను.

ఎప్పుడైనా ఏ ఆలోచనా తట్టకపోతే, నేను పత్రికకు పంపవలసిన సరుకును తక్షణమే పంపవలసివస్తే ఎండిరాలిన ఆకులపోగులో దాగి పిల్లలు ఎప్పుడు ఆడుకుందుకు వస్తారా అని ఎదురు చూసేవాణ్ణి. నా కొడుక్కి నా రహస్య స్థావరం తెలుసో లేదో కానీ, వాడు దానికి నిప్పంటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నా పిల్లలే క్రమంగా నన్ను ఓ చీడపురుగును చూసినట్టు చూసి తప్పించుకు తిరుగుతూ వచ్చారు. వాళ్ల మధ్యకు ఓ పెనుభూతంగా వచ్చిపడ్డట్టు చూసి 'ఇదిగో నాన్న వస్తున్నాడు పద పోదాం' అని వాళ్లలో వాళ్లు సణుక్కుని ఆటవస్తువులన్నీ మూటకట్టుకుని పోవడం జరిగింది. నేనెంత దయనీయంగా దిగజారిపోయాను!

అంత జరిగినా, నా బతుకు ఆర్థికంగా చూస్తే బాగానే సాగుతోంది. మొదటి సంవత్సరం పూర్తి అవుతుం దనగానే, మేము సౌఖ్యంగా బతుకుతూకూడా వెయ్యి డాలర్లు దాచగలిగాను.


కానీ ఈ సుఖంకోసం నేను చెల్లించిన మూల్యం తలుచుకుంటే చాలా బాధాకరమైన విషయమే. వెలివెయ్యడమంటే ఇదేనేమో స్పష్టంగా తెలియదు. కానీ, నేను వెలివేయబడినట్టే. నాకు స్నేహితులు లేరు. వినోదాలు లేవు. వేడుకలు లేవు. కుటుంబంలో పొందవలసిన ఆనందా లన్నిటినీ గాలికి వదిలేశాను. తాజా తేనెకోసం ఏకాకిగా వెంపరలాడే తేటి నైపోయాను. ఎక్కడ నే కుట్టి బాధిస్తానో అని అంతా దూరంగా జరిగిపోతున్నారు.

ఒకరోజు స్నేహంగా, తియ్యగా ఒకడు నన్ను చూసి నవ్వుతూ పలకరించాడు. కొన్ని నెలలుగా అలాంటి పలకరింపుకి నా మొహం వాచిపోయింది. పీటర్ హెప్పెల్ బవర్ శవాలు పూడ్చే వాళ్ల షాపు ముందు నుంచి అలా నడిచిపోతున్నాను. గుమ్మం దగ్గర నిలబడ్డ పీటర్ 'నమస్కారం' అన్నాడు. చకితుణ్ణయి అలా నిలుచుండిపోయాను. లోపలికి రమ్మన్నాడు. ఆ రోజు ముసురు పట్టి చల్లగా ఉంది. మేం వెనగ్గా ఉన్న గదిలోకి పోయాం. వెచ్చగా కాస్త నిప్పుసెగ తగుల్తోంది. ఇంతలో ఎవడో వచ్చి పిలుస్తే, ఇదిగో వస్తానని పీటర్ వాడి వెంట వెళ్లాడు. నాకు ఒక విచిత్రమైన అనుభూతి కలిగింది. నిరామయమైన ప్రశాంతి, తృప్తీ నన్ను ఆవహించింది. ఆ గది అంతా కలయజూశాను. మిలమిలా మెరిసే రోజ్‌వుడ్ శవపేటికలు దొంతుగా పేర్చి ఉన్నాయి. వాటిమీద కప్పే నల్లని గుడ్డలు, స్టాండ్లు, శవపేటికలకు అలంకరించే పక్షిఈకలు, విషాదాన్ని తలపించే రిబ్బన్లు--ఒకటేమిటి అన్నీ అంతిమ సంస్కారానికి, అపరకర్మలకు సంబంధించిన వస్తు సామాగ్రి. అంతా ప్రశాంతత. నిశ్శబ్దం. సమగ్రమైన పారమార్థిక చింతనకు తగిన అవకాశం ఉంది. జీవుడి శాశ్వత విశ్రాంతి సంబంధమైన ఊహల్లో మునిగిపోయాను. ఆ గదిలోకి అడుగుపెట్టాక ఇహలోక చింతన నన్ను తలుపుదగ్గరే విడిచి శలవు తీసేసుకుంది. ఒక హాస్యోక్తి కోసం వెతుకులాడే ఆశ కూడా లేదు. సర్వసామాన్యమైన ఆలోచనల్తో నా మెదడు బద్ధకంగా విశ్రాంతి కోరింది.

ఒక పావుగంట క్రిందట నేను అందరూ వెలివేసి విడిచిన విదూషకుణ్ణి. ఇప్పుడు నిరాడంబరంగా, నిశ్చింతగా ఉన్న వేదాంతిని. విదూషకవృత్తి నన్ను వెంట తరుముతూ ఉంటే భయంతో తప్పించుకు వచ్చిన శరణార్థిని.

నా కింతకుముందు హెప్పల్ బవర్ సంస్థ అంటే బాగా తెలియదు. పీటర్ మళ్లీ గదిలోకి రాగానే ఏమి మాట్లాడతాడో అని, నా చెవుల కవి ఎలా సోకుతాయో అని భయపడుతూ అతన్నే మాట్లాడనిచ్చాను. కానీ అతని మాటలు ఎంతో శ్రావ్యంగా ఉన్నాయి. సంతోషంతో తృప్తిగా ఊపిరి విడిచాను. పీటర్ మాట్లాడినంత సాధారణంగా, పేలవంగా ఎవ్వరూ మాట్లాడగా వినలేదు. చమత్కారం, గడుసుతనం అతని మాటల్లో ఎంత వెతికినా దొరకదు. వాకపళ్లు దొర్లినట్టు సాదాసీదాగా ఉన్నాయి. అప్పటికే నేను చిన్న జోకు సంధించాను. కానీ అది నిస్సారంగా ములికి విరిగి మొద్దుబారి పోయింది. ఆ క్షణంనుంచీ నాకు పీటర్ ఆప్తుడై కూర్చున్నాడు.

ప్రతివారం రెండోమూడో సాయంసంధ్యలు ఎవ్వరికీ తెలియకుండా పరారైపోయి అతని షాపు వెనకాల గదిలో గడుపుతూ వచ్చాను. ఆ సమయం నాకెంతో ప్రమోదాన్ని కలిగించింది. అందుకనే వేగమే తెమిలి నా పని ముగించుకుని అక్కడే ఎక్కువగా కాలం వెళ్లబుచ్చేవాడిని. మరెక్కడున్నా ఏదో హాస్యోక్తి కోసం తాపత్రయం వదిలేది కాదు నన్ను. పీటరుతో మాట్లాడుతుంటే ఆ తపన ఏమాత్రం ఉండేది కాదు. నా బుద్ధికి ఆ వాతావరణం కాస్త మెరుగుపెట్టిందనే చెప్పాలి.




ప్రతిజీవి శ్రమ నుంచి కోరుకునే ఆటవిడుపు నాకు అక్కడ లభించింది మరి. అందుకనే నేమో దారిలో నే పోతూ ఉంటే తారసపడ్డ ఒకరిద్దరు పాత స్నేహితుల్ని మళ్లా చిన్న చిరునవ్వులతోనో, చిట్టి పలకరింపులతోనో సంభ్రమంలో ముంచేశాను. నా కుటుంబాన్ని కూడా అలాగే చాలాసార్లు ఏదో ఒక ఛలోక్తితో ఉక్కిరిబిక్కిరి చేసి ఆనందాన్ని పంచాను. ఎలాగో వోలాగు హాస్యాన్ని పండించాలన్న ఆరాటానికి దూరంగా

ఉండాలని ఆరాటపడ్డాను. చిన్న స్కూల్ కుర్రాడు ఆట విడుపు కోసం పడే ఆరాటం లాంటిదే అది.


నా పని కొంత పేరుకుపోయిన మాట వాస్తవమే కానీ, ఇదివరకులా ఆ పని బాధాకరంగా, భారంగా అనిపించలేదు. అప్పుడప్పుడు అప్రయత్నంగా ఈలవేస్తూ ఇంతకు ముందుకన్నా సునాయసంగా రాసుకుపోతున్నాను. సీసాకోసం ఒక తాగుబోతు వెంపరలాడే విధంగా నే సంపాదించుకున్న విరామం కోసం ఎదురుచూసేవాడిని.

నేను మధ్యాహ్నపు విరామ సమయం ఎక్కడ గడుపుతున్నానో అని నా భార్య మథనపడింది. నేను చెప్పకుండా ఉండడమే ఉత్తమం అనుకున్నాను. కానీ ఒకరోజు చిన్న షాక్ తిన్నట్లు అయిపోయింది. ఎందుకంటే, శవపేటిక మూతకుండే వెండి హ్యాండిల్ తెచ్చి నా కాగితాలు ఎగిరిపోకుండా బరువుగా పెట్టాను. అలాగే నా కాగితాల మీద పేరుకున్న ధూళి దులుపుకోవడానికి శవ శకటంలో వాడే ఈకల చీపురకట్ట తెచ్చాను. నా రాతబల్లమీద ఆ వస్తువుల్ని తృప్తిగా చూసుకుంటూ ఉండేవాడ్ని. వాటిని చూడగానే నాకు ఇష్టమైన హెప్పెల్ బవర్ షాపు వెనుక గది గుర్తుకొచ్చేది. వాటిని చూస్తూనే నా భార్య కెవ్వుమని కేక వేసింది. అది అక్కడ ఉంచడానికి ఏదో సాకు చెప్పి ఓదార్చాను కానీ, ఆమె కళ్లల్లో ఆందోళన పోలేదు. ఇక చేసేది లేక ఆ వస్తువుల్ని అక్కడ నుంచి తీసేశాను.

ఒకరోజు పీటర్ హెప్పెల్ బవర్ నాకు చూపించిన ఆకర్షణ నన్ను అమాంతం గాలిలో తేల్చేసింది. తన చిట్టాలు, ఆవర్జాలు చూపించి తన వ్యాపారం ఎలా మూడుపువ్వులూ ఆరు కాయలుగా సాగుతుందో వివరించాడు. కాసింత పెట్టుబడి పెట్టగల ఇంకో వాటాదారు కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పాడు. "వేరే ఎవరో ఎందుకూ? నువ్వే ఉంటే బాగు" అన్నాడు.

ఆ మధ్యాహ్నం నేను అతనిగది వదిలి వస్తున్నప్పుడు ఒక వెయ్యి డాలర్లకు చెక్కు అందించాను. అలా వ్యాపారంలో వాటాదారుగా చేరాను.

కాసింత సందేహంతోనూ, బోలెడంత ఆనందం తోనూ ఇల్లు చేరాను. ఆ విషయం నా భార్యకు చెప్పాలా, వద్దా అనుకుంటున్నాను. నామట్టుకు నేనుమాత్రం గాలిలో తేలిపోయాను. హాస్యరచనకి స్వస్తి చెప్పి తియ్యని జీవితం అందించే ఫలాలు హాయిగా తినాలని ఉవ్విళ్లూ రాను. అంతేకానీ, ఆ




ఫలాల్ని పిప్పి చేసి, పిండి, పులియబెట్టి ప్రజల నవ్వుల కోసం పాకులాడా లనుకోలేదు. ఆ ఊహే నన్ను ఎంతగానో ఉత్తేజపరిచింది.

రాత్రి భోజనాల వేళ నా అర్ధాంగి నేను లేనప్పుడు వచ్చిన ఉత్తరాలు నాకు అందించింది. అందులో వద్దని తిరిగొచ్చిన నా రచనల చేవ్రాతలు ఉన్నాయి. హెప్పెల్ బవర్ దగ్గరకు వెళ్లడం ప్రారంభించిన నాటినుండీ నేను పత్రికలకు పంపిన రచనలు తరచూ తిరిగి రావడం జరిగింది. పూర్వం తాపీ మేస్త్రీ ఇటుక కట్టుడులాగా బాధాకరంగా ఉండేది నా పరిశ్రమ. కానీ ఇటీవల నా జోకులు సునాయసంగా వంపగలుగుతున్నాను.

నేను తరచూ రచనలు వంపే వారపత్రిక సంపాదకుడు వంపిన ఉత్తరం విప్పి చదివాను. ఆ పత్రిక పంపే పారితోషికమే నాకు జీవనాధారం. ఆ ఉత్తరం ఇలా ఉంది.

"అయ్యా! ఈ నెలతో మన మధ్య ఉన్న ఒప్పందం ముగుస్తుందని మీకు తెలుసు ననుకుం టాను. రానున్న ఏడాదికి ఈ ఒప్పందం పొడిగించ దలచుకోలేదని మీరు ఏమీ అనుకో వద్దు. మీ హాస్యరచనల శైలి మా పాఠకులకు గతంలో విశేషంగా వినోదాన్ని పంచినమాట వాస్తవమే కానీ, రెండు నెలల నుంచీ ఆ శైలిలో కొంత కొరత కనిపించింది. మీ తొలిరచనల్లో సహజంగా, అప్రయత్నంగా వొలికే హాస్యం-- ఇటీవల శ్రమపడి వండి వార్చినట్లనిపిస్తోంది.

మీ రచనలను ఇక ప్రోత్సహించలేనందుకు మరోసారి చింతిస్తున్నాం... సంపాదకుడు."

ఈ ఉత్తరం నా భార్యకు అందించాను. అది చదివిన నా భార్య చిన్న మొహం చేసుకుని కంట తడి పెట్టుకుంది.

"ఎంతమాట? వెధవలు" అని రోషంతో అరిచింది. "మీ రచనలు మునుపటంత బాగానే ఇప్పుడూ ఉన్నాయి. సందేహం లేదు. మీరు రాయలేకపోవడ మేమిటి?" అని అంది. కానీ, ఇక డబ్బులు రాలవని అప్పటికి కానీ తన

తలకెక్కినట్లు లేదు. "ఓరి దేవుడా! ఇప్పుడేం దారి" అని గొల్లుమంది కాస్సేపటికి.

దానికి జవాబుగా నేను దిగ్గున లేచి భోజనాల బల్లచుట్టూ చిన్న డాన్స్ చేశాను. నామీద పడ్డ కష్టం వ న్నలా పిచ్చెక్కించి ఉంటుందనే అనుకున్నట్టుంది నాభార్య. కానీ నా పిల్లలు నా వెంటబడి అడుగులు కలుపుతూ ఆనందంగా ఆడారు.

చాలా కాలం తర్వాత నేను వాళ్లతో ఆడి పాడే తండ్రిలా కనబడ్డాను కాబోలు. ఇవాళ మనం అంతా థియేటర్‌కి వెళ్తున్నామోచ్ అన్నాను. అంతేకాదు. రాత్రి మన తిళ్లుకూడా పేలస్ రిస్టారెంట్‌లోనే తెలుసా? జనకిడి జచ్ జనకిడి జనక్ జనక్..." అన్నాను.

నా ఆనందానికి కారణంకూడా ప్రకటించేశాను. మంచి లాభాలతో నడుస్తున్న శవాలు పూడ్చే వ్యాపారసంస్థలో నేను వాటాదారు నయ్యానని చెప్పాను. నా హాస్యరచన లింక గోనెసంచుల్లోనూ, బూడిదలోనూ శాశ్వతంగా తల దాచుకుంటాయి అన్నాను. హెప్పెల్ బవర్ అండ్ కంపెనీ పెరటి గదిలోని ఆకర్షణ గురించి సరిగ్గా తెలియక ఏదో సణిగినా, పత్రికా సంపాదకుడు రాసిన ఉత్తరాన్ని చేత్తో పట్టుకున్న నా శ్రీమతి పెద్దగా నా నిర్ణయానికి అభ్యంతర మేమీ చెప్పలేదు.

ఇంతకీ నేను చెప్పేదేమిటంటే ఇవాళ మా ఊళ్లో అందరికీ హాస్యోక్తి విసరడంలోనూ, ఉల్లాసంగా మాట్లాడ్డంలోనూ నాకన్నా ప్రశంస నీయుడు వేరొకడు కనపడలేదు. నా జోకులకు పెద్దగా అట్టహాసం చేసి ఒకళ్లకొకళ్లు చెప్పుకోవడం మొదలయ్యింది. నా భార్య గుసగుస లాడుతూ నాతో జరిపే మంతనాలు తిరిగి ఎంతో ఆనందాన్ని పంచుతున్నాయి. అరమరికలు, సందేహాలు లేకుండా నా పిల్లలు సహజధోరణిలో పసినోట రాలే ఆణిముత్యాల మాటల మూటలు ఒకరి కొకరుగా పంచుకుంటూ నా కనుసన్నలలోనే ఆడుకుంటున్నారు. నోట్ పుస్తకం పట్టుకుని తండ్రి వెంటాడతాడన్న భయం వాళ్లలో వీ కోశానా లేదు.

మా వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా వృద్ధిలోకి వచ్చింది. నేనేమో లెక్కలు రాసి షాపుని చూసుకుంటూ ఉంటే పీటర్ బయటి వ్యవహారాలు చక్కబెట్టుకుంటూ ఉంటాడు. నా వాగుడూ, నా హుషారూ తలచుకొంటూ ఎంత గంభీరమైన ఆవరకర్మగానీ నవ్వుల బండిలా సాగిపోతుందని అంటూ ఉంటాడు కూడా.

■